


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

శుక్రవారం 24 అక్టోబర్ 2025 పేజీలు 06

ఆదిలాబాద్


మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్


## ఈవీఎం గోదాంను

### తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్,అక్టోబర్23,సూర్య మేజర్ న్యూస్ :**

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ బలోపేతం దిశగా

## ప్రభుత్వం కృషి

**- విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించాలి**
**- విద్యార్థులకు నాణ్యమైన విద్య - వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

మిగితా. 2లో





మెరుగైన విద్యా విధానాలను అమలు చేసేందుకు

## అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో విద్యా విధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. ( మిగితా..2లో )

## ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న 23 పాఠశాలల విద్యార్థులు

- ◆ పోలీసు ఆయుధాలు, పోలీసు విధులు, బాంబు స్క్వాడ్, డాగ్స్ స్క్వాడ్‌ల పని తీరుపై అవగాహన
- ◆ వీక్షించిన 600 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు
- ◆ స్వయంగా విద్యార్థులకు ఆయుధాలు, వేలిముద్రలు ,జాగిలాల పనితీరుపై వివరణ
- ◆ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాహిత కార్యక్రమాలలో భాగంగా గురువారం పాఠశాల కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు పోలీస్ పట్టణంలోని దాదాపు8 23 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్న విద్యార్థులకు పోలీసు చేసే విధులపై, వినియోగించే ఆయుధాలు పోలీసులు అత్యవసర సమయంలో ఉపయోగించే పనిముట్లపై ప్రత్యేకంగా స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్

మిగితా. 2లో

కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి

## రైతులు మద్దతు ధర పొందాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :

రైతు సంక్షేమంలో భాగంగా 2025 - 26 వానాకాలం సంబంధిత వరి ధాన్యం కొరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం సేకరిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

మిగితా..2లో




రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే

## చెట్ల తొలగింపు

**- సీఐ వెంకటేశ్వర రావు**



**బోథ్,అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:**

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రహదారికి అడ్డంగా వచ్చిన చెట్లను తొలగించామని బోథ్ సీఐ వెంకటేశ్వర రావు అన్నారు. ( మిగితా..2లో )

భూముల వివరాలు

## పక్కాగా నమోదు చేయాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సేకరించిన భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ( మిగితా..2లో )

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను

**వేగవంతం చేయాలని - జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఇచ్చోడ సూర్య మేజర్ న్యూస్**



ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, అధికారులతో మాట్లాడిన కలెక్టర్, ప్రతి లబ్ధిదారికి కేటాయించిన ఇళ్లను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని, నిర్దేశిత గడువులోగా ఇళ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణంలో చురుకుగా పాల్గొని, అందించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలో ప్రస్తుతం కొనసాగుతున్న పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ స్థితిని అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో సత్యానంద్, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శుక్రవారం 24 అక్టోబర్ 2025

# విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి

**- విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించాలి-విద్యార్థులకు నాణ్యమైన విద్య- తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మొదటి పేజీ తరువాయి...**

గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు



తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతోపాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన



ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో నిర్మాణ దశల వారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి వరి ధాన్యం కొనుగోలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025 – 26 వానాకాలం సంబంధిత వరి ధాన్యాన్ని రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు నిబంధనలను పాటిస్తూ తేమశాతం, తప్ప, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో 4 ఏజెన్సీల ద్వారా 31 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 147, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 91, మెప్మా పరిధిలో 7, డి సి ఎం ఎస్ పరిధిలో 56 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సౌకర్యాలు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం రావడం జరుగుతుందని, నవంబర్ మొదటి వారంలో వరి ధాన్యం కోతలు మొదలవుతాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లతో ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల వివరాలు
# పక్కాగా నమోదు చేయాలి
### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**మొదటి పేజీ తరువాయి..**

గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి తహసిల్దార్లతో వివిధ అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూములు, ప్రభుత్వ భూములు, అటవీ శాఖ భూములు, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్, లావుని పట్టా భూముల వివరాల నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూములు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు, రహదారులు, రైల్వే లైన్ నిర్మాణ పనులలో సేకరించిన భూములు, ప్రభుత్వ భూములు, సీలింగ్, లావుని పట్ట, దేవాదాయ, వక్ఫ్ భూముల వివరాలను 22 ఎ నిషేధిత జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. ఏ ఒక్క సర్వే నెంబరు తప్పిపోకూడదని, గ్రామాల వారీగా నిషేధిత జాబితాలలో ఉన్న భూముల వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే చెట్ల తొలగింపు - సీఐ వెంకటేశ్వర రావు

**మొదటి పేజీ తరువాయి....**

బోథ్ మండల కేంద్రం నుండి పొచ్చెర క్రాస్ రోడ్డు వరకు రోడ్డుకు అడ్డంగా చెట్లు పెరిగాయని, పెరిగిన చెట్లతో వాహనదారులు ప్రమాదాలకు గురవడంతో పాటు తరచుగా విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కల్గుతున్నందున గురువారం బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సౌజన్యంతో అటవీశాఖ, ఆర్& బీ, విద్యుత్ శాఖల అధికారులతో పాటు బోథ్ కు చెందిన సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ సహకారంతో రోడ్డు కు అడ్డంగా వచ్చిన చెట్లను తొలగించామని ఆయన అన్నారు. చెట్ల తొలగింపు ప్రక్రియకు ఉచితంగా జేసీబీ వాహనాన్ని అందించిన చట్ల ఉమేష్ ను ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు. బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ పిలుపుతో చెట్ల తొలగింపు ప్రక్రియకు జేసీబీ వాహనాన్ని ఉచితంగా సమకూర్చిన చట్ల ఉమేష్ ను సొసైటీ సభ్యులు సన్మానించారు. ఈ మార్గం గుండా రాకపోకలు కొనసాగించే వాహనదారుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మహత్తర కార్యక్రమానికి చేపట్టడానికి ముందుకు వచ్చి వివిధ శాఖలను సమన్వయం చేసిన బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ, సభ్యులకు వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్, ఎంపీడీఓ రమేష్, ఎస్ఐ శ్రీసాయి, అటవీశాఖ సిబ్బంది, ఆర్&బీ,విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు వెండి పృథ్వి,అబ్దుల్ రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న
# 23 పాఠశాలల విద్యార్థులు

**- పోలీసు ఆయుధాలు, పోలీసు విధులు, బాంబు స్క్వాడ్, డాగ్స్ స్క్వాడ్ల పని తీరుపై అవగాహన**
**- వీక్షించిన 600 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు. - స్వయంగా విద్యార్థులకు ఆయుధాలు, వేలిముద్రలు ,జాగిలాల పనితీరుపై వివరణ- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**మొదటి పేజీ తరువాయి...**

పోలీసుల వినియోగించే ఆయుధాలపై, పోలీసులు బాంబులను కనుగొని



పనిముట్లపై, యంత్రాలపై అదేవిధంగా దొంగలను పట్టుకునేందుకు అనువుగా ఉండే వేలిముద్రలను కనుగొనే విధానాలపై, మాదకద్రవ్యాలను, బాంబులను, పేలుడు పదార్థాలను కనుగొనే జాగిలాల పనితీరును విద్యార్థులకు జిల్లా ఎస్పీ స్వయంగా సవివరంగా వివరించడం జరిగింది. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ, వారు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, వారం రోజులు పాటుగా చేసే ఈ ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజలు విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి పోలీసు అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాల ఫలితమేనని గుర్తు చేశారు. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు పోలీస్ స్టేషన్ విధులపై పూర్తి అవగాహనను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆయుధాలను వివరించే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆయుధాలు తయారీ కేంద్రాలు, తయారీ సంవత్సరం, తయారు చేసే సంస్థ, తయారు చేసిన దేశాల పేర్లు వివరాలను వెల్లడించారు. అదేవిధంగా బాంబు స్క్వాడ్ బృందం వారు విఐపి ల సందర్శన సమయంలో రోడ్డుకు ఇరువైపులా ప్రయాణించే దారులు కల్వర్టులు హెలికాప్టర్ నిలుపు ప్రదేశాలు బాంబులు తనిఖీ చేయడం వినియోగించే పరికరాలు డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్ నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్ హ్యాండ్ మెటల్ డిటెక్టర్ డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ లాంటివి విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, పటన సీఐలు బి సునీల్, కె నాగరాజు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు టి మురళి, ఎన్ చంద్రశేఖర్, రిజర్వ్ సిబ్బంది, ఫింగర్ ప్రింట్, కమ్యూనికేషన్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యా విధానాలను అమలు చేసేందుకు అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ .. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**మొదటి పేజీ తరువాయి...**

అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి లతో కలిసి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఎక్స్పోజర్ విజిట్ కొరకు సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందని, ఇందులో ఇద్దరూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులు, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు హాజరయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులను వారి పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు, డ్రాప్ అవుట్లను తగ్గించేందుకు, విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అమలు చేస్తున్న విధివిధానాలపై ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను జపాన్, సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం దేశాలకు పంపించడం జరుగుతుందని, ఆయా దేశాలలో అమలవుతున్న విద్య విధానాలు, కార్యక్రమాలను పరిశీలించి జిల్లాలో విద్యాభివృద్ధికి సహకరించడంపై అధ్యయనం చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన మొక్కజొన్న పంట ను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

సిరికొండ, సూర్య మేజర్ న్యూస్: మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలతో సిరికొండ మండలంలో మొక్కజొన్న పంట తడిసిపోయింది. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ సమలదేవి సిరికొండ మండల కేంద్రాన్ని సందర్శించి వర్షానికి తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడి పంట నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. పంటలు ఎండబెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, రెవెన్యూ అధికారులు గణేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీని కలిచిన ఆడే గజేందర్

బోథ్, అక్టోబర్23, సూర్య మేజర్ న్యూస్

తెలంగాణ రాష్ట్రం నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన శివధర్ రెడ్డిని మాజీ కేంద్రమంత్రి వేణు గోపాల్‌చారితో బోథ్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## పాముకాటుతో వివాహిత మృతి

కాగజ్నగర్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం ఇప్పలగూడ గ్రామానికి చెందిన కనక కమల (45) గురువారం పాముకాటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి ఆవరణలో పనులు చేస్తుండగా పాము కాటు వేసినట్లు తెలిపారు. మెరుగైన చికిత్స కొరకు ఆస్పత్రికి తీసుకు వెళుతున్న క్రమంలో మార్గ మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## పశువులకు టీకాలు

భీమిని, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:

మండల పరిధిలోని మల్లిడి గ్రామంలో గురువారం మండల పశు వైద్యాధికారి డా. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సుమారు 410 పశవులకు గాలికుంటు టీకాలు వేయడం జరిగింది. ప్రతి ఒక్క రైతు తమ పశవులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని, ఈ సందర్భంగా పశువైద్యాదికారి రైతులకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో డా. కిరణ్ కుమార్, మోను, గోపాలమిత్ర తిరుపతి, రైతులు పాల్గొన్నారు.



### ఉత్సాహంగా పరిసరాల శుభ్రత కోసం
## సింగరేణి ఉద్యోగులు
### - జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి

బెల్లంపల్లి, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:

బొగ్గు ఉత్పత్తి, కార్యాలయాల్లో విధులే కాకుంగా సమాజ శ్రేయస్సు, పరిసరాల శుభ్రత కోసం బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున గోలేటి లోని శ్రీ సత్య సాయి బాబా ఆలయం, జిటిసిఓఏ క్లబ్ పరిసరాల్లో స్వచ్ఛత కోసం శ్రమదానం చేశారు. గంటన్నరపాటు జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి ఏరియా అధికారులు, జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి చెత్త, గడ్డి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. గాలి వానకు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. స్వచ్ఛత కోసం సింగరేణి ఉద్యోగులు పడుతున్న శ్రమను, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న తీరును జిఎం ప్రశంసించారు. మరే ఇతర రంగాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు కానరావని అయన అన్నారు. ఈనెల 31 వ తేదీ వరకు మాత్రమే కాకుండా నిత్యం స్వచ్చత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి పౌరుడు నిత్య పరిసరాల శుభ్రత కోసం ఓ గంట కేటాయిస్తే కాలనీలు, గ్రామాలే కాదు దేశమంతా స్వచ్ఛత పరిడవిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఏరియా అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, ఇంచార్జి ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, వర్క్ షాప్ హెచ్ఓడి జి. జ్ఞానేశ్వర్, ఏరియా సెక్యూరిటి అధికారి శ్రీధర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఎస్టేట్ అధికారి సాగర్, ఐటి మేనేజర్ ముజీబ్, పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఒడి శ్రీనివాస్, సర్వే అధికారి స్వామి, సినియర్ సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ ఫారెస్ట్ అధికారిణి సుష్మ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు ..జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కొరకు అనువైన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో అనువైన ప్రదేశంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా స్థలాన్ని పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వన్యప్రాణుల వేట యత్నం
### - ముగ్గురు అరెస్ట్

**వాంకిడి, అక్టోబర్ 23,సూర్య మేజర్ న్యూస్**

వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చుతున్న ముగ్గురిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం వాంకిడి మండల పరిధిలో చోటుచేసుకుంది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ు వాంకిడి మండలం జోగాపూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ధరావత్ బీమా, నగోషే బీర్సన్, గుర్నులే తిరుపతి లు వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చుతుండగా అటవీ సిబ్బంది గుర్తించారు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ తెలిపారు. ఈ దాడిలో డిప్యూటీ రేంజ్ అధికారి ఝాన్సీ లక్ష్మి, ఫారెస్ట్ సెక్టార్ ఆఫీసర్ సాయి చరణ్, బీట్ ఆఫీసర్లు ప్రభాకర్, శ్రీనివాస్, ఎనిమల్ ట్రాకర్స్ బృందం పాల్గొన్నారు.



## పోలీసుల త్యాగాలు మరువలేనివి
### -నస్పూర్ ఎస్సై ఉపేందర్ రావు

**నస్పూర్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:**

శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు మరువలేనివని, అవి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, నస్పూర్ ఎస్సై యు. ఉపేందర్ రావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం




వారోత్సవాలలో భాగంగా, నస్పూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం (ఓపెన్ హౌస్)కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నస్పూర్ లోని ఆక్సిఫోర్డ్ స్కూల్ విద్యార్థులకు, పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ రావు మాట్లాడుతూ, చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సైబర్ నేరాలు, సైబర్ నేరాల తీరు, మోసగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఫిర్యాదు చేసేందుకు ఉన్న 1930 నంబరు గురించి వివరించామని అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల వాడకం వల్ల, కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. పోలీసు విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ వంటి విభాగాల బాధ్యతలను తెలియజేశారు. సాంకేతిక పరికరాల ప్రదర్శన, పోలీసు వ్యవస్థ పనితీరును, ప్రత్యక్షంగా చూపించామని అన్నారు. పోలీసులు వినియోగించే సాంకేతిక పరికరాలైన సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, ముఖ్యంగా డయల్ 100 విధానం గురించి తెలియజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా పరిసరాల శుభ్రత కోసం
## సింగరేణి ఉద్యోగులు
### -జిఎం విజయ భాస్కర్ రెడ్డి

**రెబ్బెన, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:**

బొగ్గు ఉత్పత్తి, కార్యాలయాల్లో విధులే కాకుంగా సమాజ శ్రేయస్సు, పరిసరాల శుభ్రత కోసం బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఉద్యోగులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని జిఎం ఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమం లో భాగంగా గురువారం గోలేటి లోని శ్రీ సత్య సాయి బాబా ఆలయం , జిటి సి ఓ ఏ క్లబ్ పరిసరాల్లో స్వచ్ఛత కోసం శ్రమ దానం చేశారు. గంటన్నర పాటు జిఎం విజయ భాస్కర్ రెడ్డి ఏరియా అధికారులు, జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి చెత్త, గడ్డి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. గాలి వానకు విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. స్వచ్ఛత కోసం సింగరేణి ఉద్యోగులు పడుతున్న శ్రమను , సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న తీరును జి ఎం ప్రశంసించారు. మరే ఇతర రంగాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు కానరావని అయన అన్నారు. ఈనెల 31 వ తేదీ వరకు మాత్రమే కాకుండా నిత్యం స్వచ్చత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి పౌరుడు నిత్య పరిసరాల శుభ్రత కోసం ఓ గంట కేటాయిస్తే కాలనీలు, గ్రామాలే కాదు దేశమంతా స్వచ్ఛత పరిడ విల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి , ఏరియా అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓ టు జిఎం కె రాజమల్లు, డి జిఎం (సివిల్) మదీనా బాషా, ఇంచార్జి ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, వర్క్ షాప్ హెచ్ఓడి జి జ్ఞానేశ్వర్, ఏరియా సెక్యూరిటి అధికారి శ్రీధర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఎస్టేట్ అధికారి సాగర్, ఐటి మేనేజర్ ముజీబ్, పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఒడి శ్రీనివాస్, సర్వే అధికారి స్వామి, సినియర్ సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్,అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ ఫారెస్ట్ అధికారిణి సుష్మ తదితరులు పాల్గొన్నారు.





### నేడు కల్యాణ లక్ష్మి
## చెక్కుల పంపిణీ

నస్పూర్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి చెక్కులను నస్పూర్ లోని, నర్సయ్య భవన్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నస్పూర్ తాసిల్దార్ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని, తాసిల్దార్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపినారు. కావున చెక్కులు రావలసిన వారందరూ వచ్చి తీసుకోగలరని వారు తెలిపినారు.

# ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి, మూత్రశాలలు సరిపడా ఉండాలని, ఫ్లోరింగ్, రూఫ్, ఫర్నిచర్ తో కూడిన భోజనశాలల ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిత్యం సందర్శిస్తూ ఆయా పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైసింగ్ విజన్ 2047 సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు పరిహారం చెక్కు అందజేత
### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల టౌన్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలోని మంచిర్యాల పట్టణ పరిధిలో గల జాఫర్ నగర్ లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులకు పరిహారం చెక్కును అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులు చిట్టోజు శరణ్య కు 36 వేల రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన చిట్టోజు శరణ్య విద్యుత్ ప్రమాదంలో తన ఇంటిని కోల్పోయినందున, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద బాధితులకు 36 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తక్షణ ఆర్థిక సహాయం క్రింద 7 వేల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో

## అండర్ 19 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

**బెల్లంపల్లి, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:** మంచిర్యాల మరియు ఆసిఫాబాద్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ అండర్ 19 క్రికెట్ పోటీలు మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ బెల్లంపల్లిలో ఎస్‌జిఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మాజీ బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటి కన్వీనర్ నాతరి స్వామి అదేవిధంగా టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ జె సి బాయ్స్ కాజీపేట ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్, కెరియర్ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు రాజేశం పాల్గొన్నారు. ఈ పోటీలకు 100 మంది పైచిలుకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు మానసిక ధైర్యాన్ని కలిపిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఈ సెలక్షన్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో పాల్గొనాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ప్రెసిడెంట్ అల్లం వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ ఎం రాజేష్, కోచ్ జాడి శేఖర్ గౌతమ్, వ్యాయామ ఉపాధ్యాయులు సుదీప్,ప్రతాప్,శ్రీనివాస్,వామన్,హరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలలో 30 మంది విద్యార్థులను క్యాంపు కొరకు ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన విద్యార్థులకు డీ ఐ ఈ ఓ అంజయ్య శుభాకాంక్షలు తెలిపారు.




# సింగరేణి సంస్థ కీలక ఖనిజ రంగంలో మరో ముందడుగు

**- సింగరేణిలో అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధం.- ఎన్.ఎఫ్.టి.డి.సి సంస్థ సాంకేతిక సహకారంతో ప్రయోగాత్మకంగా ప్లాంటు ఏర్పాటు - సింగరేణి ఓవర్ బర్డెన్, ఫ్లై యాష్, మట్టి, నిరుపయోగ మెటీరియల్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అరుదైన కీలక ఖనిజాల గుర్తింపు - సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం**



**బెల్లంపల్లి, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:** సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా కీలక ఖనిజ రంగంలో కూడా ప్రవేశించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ దిశగా మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి ప్రాంతంలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ గుర్తించి ఉత్పత్తి చేయడానికి ఒక ప్రయోగాత్మక ప్లాంటు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం రోజున కేంద్ర ప్రభుత్వ అధికారిక పరిశోధన సంస్థ ఎన్.ఎఫ్.టి.డి.సి (నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్ మెంట్ సెంటర్) తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరఫున చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం, ఎన్.ఎఫ్.టి.డి.సి నుంచి ఎన్‌ఎఫ్టిడీసీ డైరెక్టర్ బాలసుబ్రమణియన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ వివరాలను చైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరాం వివరిస్తూ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలను మరింత వేగవంతం చేస్తుందని, దీనిలో భాగంగా సింగరేణి ప్రాంతంలో లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని తెలుసుకోవడానికి, లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను ఉత్పత్తి చేయడానికి ప్రయోగాత్మకంగా ఒక ప్లాంట్ ను కొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన సాంకేతిక సహాయాన్ని ఎన్.ఎఫ్.టి.డి.సి సంస్థ నుంచి తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రయోగాత్మక ప్లాంట్ లో సింగరేణి ఓవర్ బర్డెన్ మట్టిలో లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ తో పాటు, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ లోను, ఇతర వేస్ట్ మెటీరియల్స్ లోను లభ్యమయ్యే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను గుర్తిస్తామని, ప్రయోగాత్మకంగా వీటిని ఉత్పత్తి చేయడం కూడా జరుగుతుందన్నారు. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ లభ్యతా శాతం, ఉత్పత్తికి గల అవకాశాలు, వ్యాపార కోణంలో లాభదాయకత తదితర విషయాలను దృష్టిలో పెట్టుకొని తదుపరి పెద్ద ఎత్తున ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్.ఎఫ్.టి.డి.సి ఉన్నతాధికారులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో తాము ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించామని, కొన్ని కీలక ఖనిజాలు ఓవర్ బర్డెన్ మట్టిలోనూ, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ లోను ఉన్నట్లు గుర్తించామని, కొత్తగా స్థాపించనున్న పైలట్ ప్లాంటు ద్వారా మరింత సమగ్రమైన సమాచారం లభించనుందన్నారు. సింగరేణి సంస్థతో కలిసి పనిచేయడం తమకెంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ పి అండ్ పి కె.వెంకటేశ్వర్లు, జీఎం కో ఆర్డినేషన్, మార్కెటింగ్ టి. శ్రీనివాస్, జీఎం బిజినెస్ డెవలప్మెంట్ రాందాస్, జీఎం ఎక్స్ ప్లోరేషన్ శ్రీనివాసరావు, ఎన్.ఎఫ్.టి.డి.సి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎదురెదురుగా బొలెరో, బైక్ ఢీ, అక్కడికక్కడే ఇద్దరు మృతి
### - అదుపుతప్పి పొలాల్లో బోల్తా కొట్టిన బొలెరో వాహనం

**జన్నారం, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలం మొర్రిగూడ సమీపంలో గల శ్రీ రాఘవేంద్ర రైస్ మిల్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, అదుపుతప్పి బొలెరో వాహనం పక్కనే ఉన్న పొలాల్లోకి వెల్లి పల్టీ కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం ఘన్పూర్ కు చెందిన దోసండ్ల అంకన్న (60), ఇదే మండలం నాగపూర్ కు చెందిన సిడం మోతిరాం (45) బైకుపై జన్నారం వెళుతుండగా జన్నారం వైపు నుంచి ఉట్నూర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి మొర్రిగూడ సమీపంలో బైకును బలంగా





ఢీకొట్టడంతో బైకుపై ఉన్న ఇద్దరు వ్యక్తులు కొంత దూరంలో ఎగిరిపడి మృతి చెందారు. వారిద్దరికీ తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. అదుపుతప్పిన బొలెరో వాహనం పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. బొలెరో వాహనా డ్రైవర్ షేక్ అల్మాస్ కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ జైనూర్ మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సమాచారం అందుకున్న లక్షెట్టిపేట సిఐ రమణ మూర్తి, జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష లు అక్కడికి చేరుకొని జరిగిన వివరాలను చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. మృతిచెందిన వారి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు ఫోనులో తెలియజేశారు. బొలెరో వాహనం అజాగ్రత్తగా నడపడంతోనే బైకుపై ఉన్న ఇద్దరు నిండు ప్రాణాలు బలయ్యాయని ఎస్ఐ అనూష తెలిపారు. మృతుడు దోసండ్ల అంకన్న కుమారుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆమె తెలిపారు.

## కొడుకు బువ్వ పెడుతలేడని ఓ అవ్వ ధర్నా

**కాగజ్నగర్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలంలోని నజురుల్ నగర్ గ్రామానికి చెందిన సుశీల మాజీ అనే ఓ వృద్ధ మహిళ కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కొంతమంది మహిళల తో కలిసి ధర్నా



చేస్తున్నారు. తన కొడుకు తను గతంలో ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బును, ఆస్తిని, జాగలను, అన్ని అనుభవిస్తున్నాడు కానీ తల్లినైన నాకు నిలువ నీడ లేకుండా చేసి అన్నం కూడా పెట్టడం లేదని తల్లిగా తనను చూసుకోవడం లేదని, తాను కట్టిన ఇంటిలోకి కూడా రానివ్వడం లేదని తనకు న్యాయం చేయాలని గత సంవత్సరం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈరోజు గురువారం ధర్నా చేపట్టానన్నారు ఈ ధర్నాకు మద్దతుగా ఈస్గాం నజ్రుల్ నగర్ ట్రాక్టర్స్ కాలనీ కి చెందిన బెంగాలీ మహిళలతో పాటు సీపీఎం పార్టీ నాయకులు ముంజం ఆనంద్ కుమార్ మద్దతు తెలిపారు. ధర్నా చేస్తున్న సుశీల మాజీ కొడుకు అయినా బబ్లు మాజీ, కూతురు హేమలత రాణితో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడిన కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా త్వరలో సమస్యకు పరిష్కారం చూపిస్తానని ఆమె హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

## పోలీసుల ఆధ్వర్యం లో..పిచ్చిమొక్కలు ..తొలగింపు

**భీమిని, అక్టోబర్ 23, సూర్య,మేజర్ న్యూస్:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ బెల్లంపల్లి సబ్ డివిజన్ భీమిని పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గయ్యపేట, పెద్దపేట గ్రామాలకి మద్య ఉన్న రహదారి కి



ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి... వాహన దారులకు ఇబ్బంది కరంగా మారటం తో... గమనించిన భీమిని ఎస్ ఐ విజయ్ కుమార్ దృష్టి సారించారు, గురువారం జగ్గయ్యపేట, పెద్దపేట గ్రామాల మద్య ఉన్న దాదాపు 2 కిలో మీటర్ల మేర రహదారిపై ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను ట్రాక్టర్ సహాయంతో తొలగించినారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తో పాటు.. పోలీసు సిబ్బంధి లక్ష్మణ చారి, మహేశ్వరి, వినోద్ కుమార్, పెద్దపేట గ్రామస్థుడు అక్బర్ పాషా పాల్గొన్నారు.

## నిర్మల్ నుండి మియాపూర్ కు సూపర్ లగ్జరీ బస్సు

### - డిపో మేనేజర్ కే పండరి

**నిర్మల్ ప్రతినిధి అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

ఆర్టీసీ నిర్మల్ నుండి కూకట్ పల్లి, మియాపూర్ కు సూపర్ లగ్జరి బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే పండరి తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం 11:15 నిమిషాలకు నిర్మల్ నుండి బయలుదేరి మియాపూర్‌కు



సాయంత్రం 04: 30 నిమిషాలకు చేరుకుంటుంది, తిరిగి మియాపూర్ నుండి సాయంత్రం 07:30 నిమిషాలకు బయలు దేరి రాత్రి 01:10 నిమిషాలకు చేరుకుంటుందని, ఈ సదావకాశాన్ని మియాపూర్, కూకట్‌పల్లి, జేఎన్‌టియు ఉద్యోగులు విద్యార్థులు, వ్యాపారస్తులు సద్వినియోగ పరచుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

## పశువులు వదిలేస్తే చర్యలు

**కౌటాల, 23 అక్టోబర్, సూర్య మేజర్ న్యూస్**

రోడ్ల పై పశువులను ఇష్ట రాజ్యంగా వదిలేస్తే పశుపోషకుల పై చర్యలు తీసుకుంటామని కౌటాల చంద్రశేఖర్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం కౌటాల మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది దండోరా వేయిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పై పశు వులు కానీ మేకలు విడిపించకూడదు అని ఒక వేల రోడ్డు పై పశువులు కనిపిస్తే బంజార్ దొడ్డి లో వేస్తామని తెలిపారు. నిత్యం రోడ్డు పై పశువుల తిష్ట వేయడం తో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల స్మరణార్థం ఓపెన్‌హౌస్
## పోలీస్ సేవలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**మందమర్రి, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పనితీరు, పోలీసుల ఉపయోగించే సాంకేతిక పరికరాలు, ఆయుధాలు, సీసీ కెమెరా కంట్రోల్ రూమ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణ, భరోసా సేవలపై పోలీసుల బాధ్యతలను ఓపెన్‌హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాలను పురస్కరించుకొని, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం 'ఓపెన్‌హౌస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల (ఫిల్టర్ బెడ్ ఏరియా)



విద్యార్థినీ-విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసుల విధులను దగ్గర నుంచి ప్రాక్టీగల్ గా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల తీరు, మోసగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఫిర్యాదు చేసేందుకు ఉన్న 1930 నంబరు గురించి వివరించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, భయంకరమైన పరిణామాలపై హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే మహిళలు, బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలు, షీ టీమ్ పనితీరు గురించి, పోలీసు విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ వంటి విభాగాల బాధ్యతలను క్లుప్తంగా తెలిపారు. ఓపెన్‌హౌస్‌లో భాగంగా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరును, సాంకేతిక పరికరాల ప్రదర్శనను ప్రత్యక్షంగా పరిచయం చేశారు. స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది విధులు, బాధితులు ఫిర్యాదు ఇచ్చే విధానం, దానిపై విచారణ జరిగే పద్ధతిని వివరించారు. పోలీసులు వినియోగించే సాంకేతిక పరికరాలైన సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, ముఖ్యంగా డయల్ 100 విధానం గురించి క్లుప్తంగా వివరించి, కాల్ చేసిన వెంటనే పోలీసులు ఎలా స్పందిస్తారో తెలిపారు. ఆయుధాల వినియోగాన్ని ప్రదర్శించిన అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పోలీసు అధికారులు సమాధానాలు ఇచ్చి ప్రస్తుత సమాజంలో కీలకంగా మారిన పలు అంశాలపై విద్యార్థులకు పోలీసులు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మాజీద్ ఖాన్, మిలింద్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
### సాధన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం మహాధర్న
### బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా బాధ్యులు రామగిరి రవీందర్

**నిర్మల్ ప్రతినిధి అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా బాధ్యులు రామగిరి రవీందర్ అన్నారు. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్లో ఆయన మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. తక్షణమే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికై కేంద్రంపై బలమైన ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బీసీలకు ఎస్సీ, ఎస్టీల వలె రక్షణ చట్టాలు కల్పించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని సాధన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం మహాధర్నను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా బాధ్యులు పాతర్ల హరీష్, అధ్యక్షుడు బర్మ చిన్నయ్య, రాజు, సిలారి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.




## పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్మల్ పోలీసుల సరికొత్త ప్రయత్నం పతిభ కలిగి ఆర్థిక పరిస్థితులు కష్టంగా ఉన్న ఇరవై మంది హొంగార్డుల పిల్లలకు నవీన్ గోల్డ్ అండ్ బ్రదర్స్ వారి సౌజన్యంతో ఆర్థిక సహాయం

**నిర్మల్ ప్రతినిధి అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్.**

నిర్మల్ జిల్లాకు చెందిన పోలీస్ కుటుంబంలో జన్మించిన నవీన్ చేత స్థాపించబడిన నవీన్ గోల్డ్ అండ్ బ్రదర్స్ ఒక్కో విద్యార్థికి చదువులకు ఉపయోగపడేలా 10,000 రూపాయల సహాయం చేయడానికి సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చారు. పోలీస్ అమరవీరుల స్మారక దినం వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా, ఈరోజు నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని హొం గార్డు కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన 20 మంది విద్యార్థులకు, గతంలో చనిపోయిన హొం




గార్డుల యొక్క ప్రతిభావంతులైన పిల్లలకి,ఒక్కొక్కరికి 10,000 రూపాయల విలువైన చెక్కులను జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో, నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యం వారు అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కూడా పేద కుటుంబాలకు చెందిన సిబ్బంది ఉన్నారు. వారిలో చాలా మంది పిల్లలు ప్రతిభావంతులు, కష్టపడి చదువుకుంటున్నారు. అలాంటి పిల్లల ప్రతిభను గుర్తించి, వారు ఉన్నత విద్యలో మరింత రాణించేందుకు ఈ ప్రోత్సాహకాన్ని అందించడం జరిగింది. వారి తల్లిదండ్రులు ప్రజల భద్రత కోసం రాత్రింబగళ్లు కష్టపడుతుంటే, ఆ కుటుంబాల పిల్లలకు ఈ ఆర్థిక సహాయం ద్వారా మనం చిన్న సాయం చేసినా, అది వారి భవిష్యత్తు నిర్మాణానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చి, పేద పోలీస్ కుటుంబాల పిల్లలకు ఆర్థిక సహాయం చేసిన నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని తెలియ జేసారు. నవీన్ జ్యూవెలర్స్ యజమాని మాట్లాడుతూ, నేను ఒక పోలీస్ కుటుంబానికి చెందిన వ్యక్తిని. చిన్నప్పటి నుండి పోలీస్ వాతావరణంలో పెరిగిన కారణంగా, పోలీస్ సిబ్బంది ు కానిస్టేబుళ్లు, హొం గార్డులు ు ఎదుర్కొనే కష్టాలు, బాధలు నాకు బాగా తెలుసు. అందుకే పోలీసుల కుటుంబాల పిల్లలను ప్రోత్సహించాలనే ఆలోచనతో, జిల్లా ఎస్పీ మేడంతో చర్చించి ఈ ఆలోచనను అమలు చేసాను అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిలతో పాటు,నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యం ప్రతినిధులు, పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎస్పీ కి నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో వివిధ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న పనులన్నీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి
### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్.**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న పనుల పురోగతిపై వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ మండలాల్లో నిర్మాణంలో ఉన్న పనులను గురించి వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులు, పనుల పురోగతి, పూర్తి చేయడానికి ఉన్న గడువు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న పనులను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు అంతా పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. పనులన్నీ నిర్ణిత గడువులోగా, నాణ్యవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఓ జీవరత్నం, వివిధ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు సందీప్, వేణుగోపాల్ సునీల్ కుమార్, గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.








### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ
# రసాయన శాస్త్ర దినోత్సవం

**భైంసా టౌన్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ రసాయన శాస్త్ర దినోత్సవాన్ని "మోల్ డే"గా రసాయన శాస్త్ర



విభాగం తరపున జరపడం జరిగింది.ఈ సందర్భంగా విభాగం అధిపతి కే.రఘునాథ్ మాట్లాడుతూ నిత్యజీవితంలో రసాయన శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.మోల్ అనగా కుప్ప రాసి సమూహం అని ఏదైనా ఒక మోల్ పదార్థము 6.022×10÷23 అణువులు గాని పరమాణువులు కల్గి,ఉంటాయని,అదేవిదంగాఒక మోల్ వాయువు 22.4 లీటర్ల గణపరీమానాన్ని కల్గి ఉంటాయని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, ఎక్స్టెంపుర్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమానికి డాక్టర్ భీమారావు డాక్టర్ శంకర్, డాక్టర్ కొసరి సంతోష్, సుధాకర్ గారు, సురేందర్, కిషన్, అబ్దుల్లా మస్జార్ శ్రావన్య ,ఉజ్మా తపస్సు, డాక్టర్ నహీదా, దివ్య మొదలగువారు పాల్గొన్నారు.

### గ్రాండ్‌పేరెంట్స్ పాదపూజ
## విలువల పండుగగా మారిన ఆరోగ్య పాఠశాల
### - జిల్లా కలెక్టర్ రాజార్షి షా

**ఆదిలాబాద్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

వయోవృద్ధులు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, పిల్లలు వారి పట్ల ప్రేమ, గౌరవం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. గురువారం ఇచ్చోడ మండలం బోరిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో భాగంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ, వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన "గ్రాండ్‌పేరెంట్స్ డే" పాదపూజ కార్యక్రమం కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారి అమ్మమ్మ,



తాతయ్యలకు పాదపూజ చేశారు. పూలు సమర్పించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల యోగా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "గ్రాండ్‌పేరెంట్స్ మన కుటుంబాల మూలస్థంభాలని, వారు సృష్టించిన విలువలే నేటి తరానికి మార్గదర్శనం అన్నారు. వయస్సు పెరిగినా వారి అనుభవం, ఆలోచనలు ఎప్పటికీ సమాజానికి దారి చూపిస్తాయని, యువతరం పెద్దల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. తరతరాల మధ్య బంధాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు సమాజంలో విలువల పరిరక్షణకు దోహదం చేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. వయోవృద్ధులు అనుభవజ్ఞులు, వారి సూచనలు, సలహాలు యువతకు మార్గదర్శకమని చెప్పారు. విద్యార్థులు పెద్దలను గౌరవించి, వారి జీవిత అనుభవాలను పాఠాలుగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్, వయోవృద్ధులను, అధికారులను శాలువాలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, వృద్ధులతో కలిసి కలెక్టర్ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అంతకుముందు పాఠశాలలో వయోవృద్ధుల సంక్షేమం, సేవలు, సమస్యల పరిష్కారం పై హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. వృద్ధుల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వృద్ధుల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా సమాజం వ్యవహరించాల్సిన అవసరాన్ని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షులు దేవిదాస్ దేశ్ పాండే, ఉపాధ్యక్షులు ఎం గంగాధర్, సెక్రెటరీ రాం కులకర్ణి, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### - కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
### -ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకుల సమాచారం, టెంట్, త్రాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలి
### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకుల సమాచారం, టెంట్, త్రాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. రైతులకు వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి టోల్ ఫ్రీ నంబరు 9182958858 ను ప్రదర్శించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని వివరించారు. సరిపడినంతమంది సిబ్బంది, కూలీలు, సరిపడినన్ని లారీలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరిపడినన్ని తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, టార్పలిన్ లు, గన్ని సంచులు, ఉంచుకోవాలన్నారు. అధికారులు నిరంతరం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వివరించారు. అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను తనిఖీలు చేస్తూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతుందో లేదో చూడాలని అన్నారు. రోజువారీగా వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను రోజువారీగా నివేదికలను తమకు అందజేయాలని తెలిపారు. సన్న, దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు వేరు వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు నిర్ణిత గడువులోగా డబ్బులు జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, మేనేజరు సుధాకర్, డిఆర్డివో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




### గోసంరక్షుడు సోనుసింగ్ పై
## కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలి
### -ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**భైంసా టౌన్, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

హైదరాబాదులో గో రక్షకుడు ప్రశాంత్ సింగ్ సోను పై కాల్పులు జరిపిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోనూసింగ్ పరామర్శించిన సందర్భంగా అయన మాట్లాడారు. బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తో కలిసి సోనుసింగ్ ను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో హిందువులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. సోన్ సింగ్ పై దాడి వెనుక ఉన్న వారిని తక్షణమే పోలీసు యంత్రాంగం గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంత్ సింగ్ లాంటి గో రక్షకులపై అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. హిందువుల మనోభావాలకు ముడిపడినటువంటి గోవులను రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు.సోను సింగ్ కుటుంబాన్ని బిజెపి పార్టీ తరుపున ఆదుకుంటామన్నారు. తక్షణమే కాల్పులు జరిపిన దుండగులను పట్టుకోవాలని లేని పక్షం లో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు.

## 'ఆయా' పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానం

**సిరికొండ, అక్టోబరు 23 సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ ఎంపీపీఎస్ భవిత కేంద్రంలో కేర్ గివింగ్ వాలంటీర్ (ఆయా) పోస్టు ఖాళీగా ఉందని, ఆ పోస్టును కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఎంఈవో సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు ఫారం నింపి అవసరమైన జిరాక్స్ పత్రాలు జతచేసి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎంఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులు కావాలని, మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు అని చెప్పారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, స్థానికులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తప్పనిసరిగా జతచేయాలని సూచించారు. భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు మంగళవారం, శుక్రవారం రోజుల్లో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

### నిరుద్యోగ యువతకు
## వరం మెగా జాబ్ మేళా...
### - మెగా జాబ్ మేళా పోస్టర్ విడుదల
### - నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్న జనరల్ మేనేజర్

**బెల్లంపల్లి, అక్టోబర్ 23, సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ ఆదివారం రోజున బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన ప్రచార పోస్టర్ ను బెల్లంపల్లి ఏఎంసి గ్రౌండ్ లో గురువారం రోజున ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా బెల్లంపల్లిలో సుమారు 80 కి పైగా ప్రైవేటు కంపెనీల వారితో మెగా జాబ్ మేళాను ఆదివారం నిర్వహిస్తున్నామని, దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అన్నారు. జాబ్ మేళాలో పాల్గొనదలిచిన నిరుద్యోగ యువత పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులు తమకు గల విద్యార్హతలకు సంబంధించిన ఉద్యోగాలను ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సి ఎం ఓ ఏ ఐ అధ్యక్షులు రమేష్, సివిల్ ఎస్. ఈ రాము, జి.ఎం.వి.టి.సి మేనేజర్ శంకర్, ఏఐటియుసి సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, ఏఐటియుసి మందమరి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, గోగర్ల శోభన్ బాబు నోబెల్ ఎంపవర్మెంట్ స్టేట్ మేనేజర్, సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న మినీ జాబ్ మేళా
### - జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

**నస్పూర్, అక్టోబరు 23, సూర్య మేజర్ న్యూస్**

జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్ లో ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జె. వి. జి. మేనేజ్మెంట్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ – హైదరాబాద్ సంస్థలో హైదరాబాద్ ప్రాంతంలో పని చేసేందుకు 100 టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) పోస్టుల భర్తీకి ఐటిఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, వెల్డర్) అర్హత కలిగి 18–22 వయసు కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులు, 100 ట్రైనీ టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) భర్తీకి ఎస్. ఎస్. సి./ఇంటర్/ ఏదేని డిగ్రీ అర్హత కలిగి 18– 23 వయసు అర్హత కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9010584000, 8333059029, 9963452486 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.